సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 4 । మే । 2024







ఉప్పొంగిన ఉత్సాహం.. జేజేలు పలుకుతూ



జన కెరటం: నరసాపురంలోని స్టీమర్ రోడ్డులో సీఎం జగన్ ప్రచార సభకు హాజరైన జన సందోహంలో ఓ భాగం

విజయం మనదే.. నరసాపురం స్టీమర్ రోడ్డులో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఫ్యాన్ గుర్తును చూపిస్తూ ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

నరసాపురం.. అభిమాన సంద్రం

తీరం పోటెత్తిందా.. గోదావరి ఉప్పొంగిందా అన్నట్టు నరసాపురం జన సునామీని తలపించింది.. జై జగన్.. జయహో జగన్ నినాదాలతో హోరెత్తింది.. **తమ అభిమాన నేతను చూసేందుకు.. సంక్షేమ సారథికి మద్దతు ఇచ్చేందుకు ప్రజలు అశేషంగా తరలివచ్చారు.. మండుటెండలోనూ సీఎం జగన్ కోసం వేచి ఉన్నారు.. ఆయన ప్రసంగానికి ఆద్యంతం జయజయధ్వానాలు పలికారు. కూటమి నేతలను తిప్పికొడతామంటూ నినాదాలు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ** అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం నరసాపురం స్టీమర్ రోడ్డులో నిర్వహించిన ప్రచార సభకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

జయజయధ్వానాలు

- సీఎం జగన్‌కు ప్రజలు బ్రహ్మరథం
- మండుటెండనూ లెక్కచేయని ధైనం
- స్టీమర్ రోడ్డులో సభకు పోటెత్తిన జనం
- కూటమిని తిప్పికొడతామంటూ మద్దతు

సాక్షి, భీమవరం: నరసాపురంలోని స్టీమర్ రోడ్డులో వైఎస్సార్‌సీపీ ఏర్పాటుచేసిన బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చారు. ఎటుచూసినా జన సమూహంతో పండగ వాతావరణం కనిపించింది. ఉదయం 10.30 గంటలకు సభ కాగా 8 గంటల నుంచే నరసాపురం, పరిసర నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చేరుకోవడం కనిపించింది. చెంతకు వస్తున్న అభిమాన నేతను చూసేందుకు చిన్నాపెద్దా తేడాలేకుండా వృద్ధులు, మహిళలు, యువత, చిన్నారులు సభకు పోటెత్తారు. తీన్‌మార్ వాయిద్యాలు, మోటార్ సైకిల్ ర్యాలీలతో యువత హోరెత్తించారు. నిర్ణీత సమయానికి స్టీమర్ రోడ్డులోని సభాప్రాంగణం అంతా జనంతో నిండిపోయింది. వెల్లువలా తరలివచ్చిన జనాన్ని కట్టడి చేసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

మండుటెండనూ లెక్కచేయక..

ఉదయం 8 గంటల నుంచే సూర్యుడు ప్రతాపం చూపించడం ప్రారంభించాడు. ఉక్కపోతతో చెమటలు కారుతున్నా, ఎండ తీవ్రత తాళలేకున్నా అభిమాన నేత రాక కోసం ప్రజలు బారులుతీరి ఎదురుచూశారు. గంటన్నర పాటు సీఎం జగన్ రాక ఆలస్యమైనా అంతటి మండుటెండలోనూ చెక్కుచెదరకుండా వేచి ఉండటం విశేషం. వైఎస్సార్‌సీపీ గీతాలకు జెండాలు ఊపుతూ యువత నృత్యాలు చేస్తూ అందరిలో ఉత్సాహం నింపారు. ప్రచార రథం పక్కనే ఆస్పత్రి భవనం వద్ద ప్రచార గీతాలకు లయబద్ధంగా యువతి చేసిన నృత్యం చూసి పార్టీ నేతలు అభివాదం చేస్తూ అభినందించారు. ఉదయం 11.40 గంటల సమయంలో సభా ప్రాంగణం మీదుగా టేలర్ హైస్కూల్ గ్రౌండ్‌లోని హెలీప్యాడ్‌కు చేరుకుంటున్న సీఎం జగన్ హెలికాప్టర్‌ను చూసి చేతులు ఊపుతూ ప్రజలు స్వాగతం పలికారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కోసం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు పార్టీ శ్రేణుల ద్వారా సభలోని వారికి విరామం లేకుండా మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు అందించారు. ఉదయం 11.55 గంటల సమయంలో సీఎం జగన్ కాన్వాయ్‌లో సభా ప్రాంగణానికి చేరుకున్నారు. పార్టీ శ్రేణులు, యువకులు కాన్వాయ్ వెంట ర్యాలీగా వచ్చారు. సభలోని వారికి బస్సులోంచి చేతులు ఊపుతూ సీఎం జగన్ సభాస్థలిలోని ప్రచారం రథంపైకి చేరుకున్నారు.

అలసటను దూరం చేసిన ఆప్యాయత

'నరసాపురం సిద్ధమా?.. సమయం 12.15 మిట్ట మధ్యాహ్నం. ఇంతటి ఎండలో ఏమాత్రం కూడా ఎండను ఖాతరు చేయకుండా చిక్కటి చిరునవ్వుల మధ్య ఇంతటి ప్రేమానురాగాలు, ఆప్యాయతలు, ఆత్మీయతలు పంచుతున్న నా ప్రతి అక్కకూ, ప్రతి చెల్లెమ్మకూ, ప్రతి అవ్వకూ, ప్రతి తాతకూ, ప్రతి సోదరుడికీ, ప్రతి స్నేహితుడికీ.. మీ అందరి ఆప్యాయతలకు మీ బిడ్డ, మీ జగన్ రెండు చేతులు జోడించి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాడు..' అంటూ ప్రసంగం ప్రారంభంలో సీఎం జగన్ చెప్పిన మాటలు అప్పటివరకు ప్రజలు పడిన అలసటను దూరం చేశాయి.

సీఎం జగన్ ప్రసంగంతో నయా జోష్

దాదాపు అరగంట పాటు సాగిన సీఎం జగన్ ప్రసంగం ఆద్యంతం ప్రజల్లో ఉత్సాహం నింపింది. జై జగన్.. సీఎం.. సీఎం అంటూ సభా ప్రాంగణమంతా నినాదాలతో హోరెత్తింది. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేశానని ఈ పెద్దమనిషి అంటుంటాడు, ఆయన పాలనలో ఏనాడైనా ఇన్ని స్కీములు ఇచ్చాడా? ఇప్పటి మాదిరిగా ఏనాడైనా అవ్వాతాతలకు ఇంటింటికీ పింఛన్ ఇచ్చాడా? రైతు రుణమాఫీ చేస్తానన్నాడు.. చేశాడా? ఈ పెద్దమనిషి చంద్రబాబు పేరు చెబితే పేదలకు చేసిన కనీసం ఒక్కటంటే ఒక్క స్కీమ్ అయినా గుర్తుకు వస్తుందా? అంటూ ముఖ్యమంత్రి అడిగిన ప్రశ్నలకు లేదూ.. లేదూ.. అంటూ రెండు చేతులు ఊపుతూ ప్రజలు మద్దతు తెలిపారు. ఈ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో తెచ్చిన పథకాలు గురించి వివరిస్తున్నప్పుడు అవునూ.. అవునూ.. అంటూ ప్రజలు పెద్దఎత్తున మద్దతు పలికారు.



మన అభ్యర్థులు వీరే.. మద్దతివ్వండి.. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గూడూరి ఉమాబాల, ముదునూరి ప్రసాదరాజుకు ఓటేయాలని కోరుతున్న సీఎం జగన్



అక్కచెల్లెమ్మల అభిమానం.. సీఎం జగన్ కాన్వాయ్‌ని చూసి జేజేలు పలుకుతున్న మహిళలు

కనీవినీ ఎరుగని అభివృద్ధి

నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు



రాష్ట్రంలో వినూత్న పాలనను సీఎం జగన్ మన ముందుకు తెచ్చారు. గతంలో దళారులు, అవినీతి, పక్షపాతం వల్ల పథకాలన్నీ కొందరు జేబుల్లోకే వెళ్లిన పరిస్థితి. కానీ ఈ ఐదేళ్లలో వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రతి ఇంటికీ నేరుగా సంక్షేమ ఫలాలను పారదర్శకంగా అందించాం. నరసాపురం నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని అభివృద్ధి చేశాం. ఆర్టీసీ బస్టాండ్, వంద పడకల ఏరియా ఆస్పత్రి, కాటన్ పార్క్, ఆక్వావర్సిటీ తదితర ఎన్నో అభివృద్ధి పనులు చేశాం. బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్, వశిష్ఠ గోదావరిపై వంతెన పనులకు మోక్షం కలిగించాం. రానున్న ఐదేళ్లలో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తాం.

ప్రజల జీవితాల్లో ఎంతో మార్పు

ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల



జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాజకీయాలతో పాటు ప్రజల జీవితాల్లో ఎంతో మార్పు వచ్చింది. గతంలో ఎవరూ సీఎం జగన్‌లా ప్రజలకు సంక్షేమాన్ని అందించలేక పోయారు. గతంలో రాజకీయాలు అంటే ధనబలం ఉన్న వ్యక్తులకు మాత్రమే పరిమితం అయ్యేవి. తొలిసారి సీఎం జగన్ పాలనలో బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు వచ్చాయి. ఓసీలు మాత్రమే పోటీ చేసే నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ స్థానాన్ని మొదటిసారిగా బీసీలకు అవకాశం ఇచ్చిన జగనన్నకు కృతజ్ఞతలు.

సామాన్యులకూ సీట్లు

పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి)



గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం మేర అమలుచేశారు. నవరత్నాలతో పాటు నవరత్నాల ప్లస్‌ను మనమంతా అందుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. ఎన్నడూ లేనివిధంగా అతి సామాన్యులకూ సీట్లు కేటాయించిన గొప్ప వ్యక్తి సీఎం జగన్. మనమంతా కష్టపడి పార్టీ కోసం పనిచేసి సీఎం జగన్‌ని మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాలి. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను, ఒక ఎంపీ స్థానాన్ని గెలుచుకుని సీఎం జగన్‌కు బహుమతిగా ఇవ్వాలి.

కూటమి మేనిఫెస్టో బూటకం

ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్



ప్రతిపక్ష పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టో అంతా అబద్ధాల పుట్ట. బడ్జెట్‌కు సరిపోల్చని, ఆచరణ సాధ్యం కాని హామీలను ఇస్తున్నారు. కానీ సీఎం జగన్ మాట ఇచ్చారంటే అమలుచేసి చూపిస్తారన్న విషయం అందరికీ తెలుసు. నరసాపురంలో బస్టాండ్‌ను అభివృద్ధి చేశారు, 100 పడకల ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చారు. కాపునేస్తం ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారు. ఇలా అన్నివర్గాలను అభివృద్ధిలోకి తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది.



మా నమ్మకం నువ్వే జగన్.. ఓ యువకుడి ఉత్సాహం



మేమంతా మీవెంటే.. మహిళల ఆనందోత్సాహాలు



జయహో జగన్.. జేజేలు పలుకుతున్న అక్కచెల్లెమ్మలు

క్లుప్తంగా

తనిఖీల్లో నగదు స్వాధీనం



రహదారిపై తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: ఎన్నికల విధుల్లో భాగంగా వీరవాసరం ప్రధాన రహదారిపై నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో శుక్రవారం రూ.87 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ జె.సుశీలదేవి చెప్పారు. కొణితివాడకు చెందిన యరకరాజుగోపాలకృష్ణ రాజు ఈ నగదును తీసుకుని వెళుతుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసున్నారన్నారు. నగదును సీజ్ చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేయడం జరుగుతుందన్నారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్న కారణంగా ప్రజలు రూ.50వేలకు మించి నగదును వెంట తీసుకువెళ్లరాదన్నారు. స్క్వాడ్‌లో మండల స్థాయి అధికారులు కే నాగేశ్వరరావు, వీరభద్రరావు, సురేష్, మూర్తి తదితరులు ఉన్నారు.

నేడు మార్టేరులో ఓపెన్ మైండ్ సెమినార్

పెనుమంట్ర: మార్టేరులోని రెడ్డి కల్యాణ మండపంలో శనివారం 'ఎన్నికలు 2024 – ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు' అనే అంశంపై ఓపెన్ మైండ్ ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించనున్నట్లు సెమినార్ నిర్వాహకుడు, స్టేట్ బీఎడ్ కాలేజీ అసోసియేషన్ అధ్యక్షుడు మేడపాటి విజయరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెమినార్‌లో ముఖ్యవక్తలుగా ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ మాజీ కార్యదర్శి సీఈవో, ఓపెన్ మైండ్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రాజశేఖర్‌రెడ్డి, నవరత్నాలు అమలు ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఎ.నారాయణమూర్తి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఎస్ఆర్‌టీ ఎఫైర్స్ అండ్ సర్వీస్ అడ్వైజర్ మేడపాటి వెంకట్.ఎస్, ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఈడీ ఎ.కోటేశ్వరరావు హాజరవుతారన్నారు. సెమినార్‌లో విద్యావేత్తలు, విశ్రాంత ఉద్యోగులు, రైతులు, ఇతర వర్గాల ప్రముఖులు, విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మునిసిపల్ కమిషనర్ బదిలీ

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం మునిసిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్ బదిలీ అయ్యారు. ఈయనను జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆయన కలెక్టరేట్‌లో పనిచేస్తారు. ఈయన స్థానంలో మునిసిపల్ ఇంజనీర్ డి.మురళీకృష్ణకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు ఇచ్చారు.

పండుటాకులు విలవిల



తణుకులో మంత్రి కారుమూరి సహకారంతో పంపిణీ చేసిన మజ్జిగను తాగుతున్న వృద్ధులు



తణుకులో పింఛను కోసం బ్యాంకుకు వచ్చి యువకుల సాయంతో తిరిగెళుతున్న వృద్ధురాలు



భీమవరం ఇండియన్ బ్యాంకు వద్ద వృద్ధులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న మారోజు గణేష్

విలపింఛెన్

- చంద్రబాబు పగబట్టాడంటున్న అవ్వాతాతలు
- తమ ఉసురు తగులుతుందంటూ శాపనార్థాలు
- పింఛను కోసం పండుటాకులకు తప్పని అవస్థలు
- బ్యాంకుల వద్ద పడిగాపులు.. గంటల తరబడి నిరీక్షణ

'ముసలోళ్లను ముప్పతిప్పలు పెడుతున్నావు.. మా ఉసురు నీకు తగులుతుంది.. మామీద ఎందుకు నీకు ఇంత పగ.. ఆ దేవుడే నీకు శిక్ష వేస్తాడు' అంటూ అవ్వాతాతలు చంద్రబాబును శాపనార్థాలు పెడుతున్నారు. జగన్ బాబు ఇంటి గుమ్మంలోకే పింఛను ఇచ్చారని, చంద్రబాబు ముసలోళ్లను ఇబ్బందులు పెట్టాలనే ఉద్దేశంతో ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేసి తమను రోడ్డుపాలు చేశాడంటూ అవ్వాతాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడో తేదీ వచ్చినా ఇంకా పింఛను చేతికి అందక బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సి రావడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. శుక్రవారం జిల్లాలోని పలు బ్యాంకుల వద్ద అవ్వాతాతలు పింఛను సొమ్ము కోసం మండుటెండలో నిరీక్షిస్తూ అష్టకష్టాలు పడుతూ ఇలా విలవిలాడుతూ కనిపించారు.



భీమవరం యూనియన్ బ్యాంక్‌లో పింఛను సొమ్ము కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

భీమవరం/తణుకు అర్బన్/ భీమవరం (ప్రకాశం చౌక్): ప్రతి నెలా ఒకటో తేదీనే తెలవారకముందే ఇంటి వద్దే ఠంచన్‌గా పింఛను సొమ్ము అందుకునే అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు తమను రోడ్డు పాలు చేశారంటూ ప్రతిపక్ష పార్టీలను దుమ్మెత్తిపోస్తున్నారు. శుక్రవారం జిల్లాలోని పలు బ్యాంకుల వద్ద పింఛను సొమ్ము కోసం గంటల తరబడి పడిగాపులు పడుతూ పింఛను లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అధికారులు బ్యాంకులో వేసిన సొమ్ములు ఎలా తీసుకోవాలో తెలియక తెలిసిన వారిని డబ్బుతీసిపెట్టండంటూ ప్రాధేయపడ్డారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో సుమారు 2.34 లక్షల మంది పింఛను లబ్ధిదారులు ఉండగా, వీరందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వలంటీర్లతో ఇంటివద్దకే పింఛను సొమ్మును ప్రతి నెలా ఒకటో తేదీన వేకువజామునే పంపిణీ చేయించింది. వలంటీర్ల వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి టీడీపీ, జనసేన అధినాయకులు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ చులకన భావంతో వలంటీర్ల వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇటువంటి తరుణంలోనే దేశవ్యాప్తంగా వలంటీర్ల వ్యవస్థకు ప్రశంసలు లభించడంతోపాటు ప్రభుత్వానికి మంచిపేరు వచ్చింది. ఎన్నికల సమయంలో కోర్టుల్లో కేసులు వేయించిన చంద్రబాబు వలంటీర్ల సేవలను అడ్డుకున్నారు. దీంతో ఇంటి వద్దే పింఛను పొందే లబ్ధిదారులకు అవస్థలు ప్రారంభమయ్యాయి. గత నెలలో సచివాలయాల వద్ద పంపిణీ చేయగా, ఈ నెల బ్యాంకు ఖాతాల్లో పింఛను జమ చేశారు.

మండుటెండలో..

పింఛను సొమ్ము బ్యాంకు ఖాతాలకు జమ చేయడంతో ఈ నెల 1వ తేదీ నుంచి వృద్ధులు, విలాంగులు, ఒంటరి మహిళలు బ్యాంకుల చుట్టూ తిరగక తప్పలేదు. ఎండతీవ్రత, వడగాల్పులు అధికంగా ఉన్నా పింఛను సొమ్ము చేతికి అందకపోతే పూట గడిచేదెలా, మందులు కొనుక్కునేది ఎలా అంటూ ఉదయాన్నే బ్యాంకుల వద్ద క్యూలు కడుతున్నారు. ప్రధానంగా బ్యాంకు సౌకర్యం లేని గ్రామాల ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లడం మరింత ఇబ్బందికర పరిస్థితిలో వ్యయప్రయాసలకు గురవుతున్నారు. చాలా చోట్ల బ్యాంకుల్లో నిరీక్షించేందుకు కూడా జాగా లేక బ్యాంక్ కార్యాలయాల బయటే అవ్వాతాతలు నిలబడి ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది.

జిల్లాలో 2.34 లక్షల పింఛను లబ్ధిదారులు

జిల్లాలో మొత్తం 2.34 లక్షల మంది పింఛను లబ్ధిదారులు ఉండగా, శుక్రవారం నాటికి దాదాపు 95 శాతం మందికి పింఛను అందించామని, వీరిలో 28 శాతం మందికి సుమారు రూ.18.24 కోట్లు చేతికి అందించామని అధికారులు చెబుతున్నారు. బ్యాంకుల్లో జమచేసిన పింఛను సొమ్ము తీసుకోవడంలో 2,500 మంది వివిధ కారణాల వల్ల ఇబ్బందులు ఉండటంతో వీరందరికీ పింఛను సొమ్మును చేతికి అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు చెప్పారు.

వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ వలంటీర్ల సేవాగుణం

మండుటెండలో పింఛను తీసుకోవడానికి దూర ప్రాంతాల నుంచి బ్యాంకులకు వచ్చిన అవ్వాతాతలు, దివ్యాంగులకు వైఎస్సార్ సీపీ నాయకులు, రాజీనామా చేసిన వలంటీర్లు తమ సేవాగుణాన్ని చాటారు. వారికి మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందించడమే కాక సొమ్ము విత్‌డ్రా చేసుకోవడానికి ఫారాలను పూరించి వారికి ఆసరాగా నిలిచారు.



తణుకు ఐసీఐసీఐ బ్యాంకు వద్ద పింఛను సొమ్ము కోసం ఎండలో మెట్ల వద్దే నిరీక్షిస్తున్న వృద్ధులు

మళ్లీ ఆ రోజులు వస్తే బాగుండు



పెన్షన్ తీసుకోవడానికి **రాయకుదురు** బ్యాంక్‌కు **వచ్చాను. మా ఊరి నుంచి మూడు** కిలోమీటర్ల **దూరం నుంచి** ఎండలో **వచ్చి బ్యాంకు వ**ద్ద పడిగాపులు కాశాను. గతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వలంటీర్ల ద్వారా ఇంటికే పెన్షన్ పంపిణీ చేయించేవారు. మళ్లీ ఆ రోజులు వస్తే బాగుండు.

– కదలి సత్యవతి, జగన్నాథపురం

ఎండలో అవస్థలు పడుతూ వచ్చా



పింఛను సొమ్ము తీసుకునేందుకు ఎండలో అవస్థలు పడుతూ బ్యాంకుకు వచ్చా. నా బ్యాంక్ ఖాతా నుంచి పింఛను సొమ్ము తీసుకునేందుకు గంటల తరబడి బ్యాంక్ వద్ద నిరీక్షించాల్సి వచ్చింది. విత్‌డ్రా ఫారాలు రాయడం చేతకాక ఇబ్బందులు పడ్డా. వలంటీర్ ద్వారా ఇస్తే నాకు ఈ కష్టాలు ఉండేవి కావు.

– బూర అప్పారావు, ఫింఛన్‌దారుడు, అత్తిలి

ఇంటికే వచ్చి పింఛను ఇవ్వచ్చుగా..



వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి ప్రతి నెలా పింఛను సొమ్ము ఇచ్చేవారు. ఈనెల పింఛను సొమ్ము బ్యాంకు ఖాతాకు వేశామని చెప్పడంతో బ్యాంకుకు వచ్చా. బ్యాంకులో జనం రద్దీగా ఉండటంతో క్యూలైన్లో నిల్చోవడానికి అవస్థలు పడ్డాను. గతంలో మాదిరిగా వలంటీర్ ద్వారా ఇస్తే మాలాంటి వృద్ధులకు మేలు జరుగుతుంది.

– కాసగాని సత్యవతి, ఫింఛన్‌దారు, అత్తిలి

మళ్లీ జగన్ పాలనే రావాలి



సీఎం జగన్ దయవలన ఇంటికే వచ్చి వలంటీర్లు పింఛన్ అందజేసేవారు. కానీ టీడీపీ నాయకుల కుతంత్రాలతో, గత మూడు రోజుల నుంచి పింఛన్ల కొరకు బ్యాంకుల చుట్టూ తిరుగుతూ నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. ఇలాంటి దుస్థితి కల్పించిన టీడీపీ నాయకుల పాలన మాకు వద్దు అని, మళ్లీ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నా.

– తిరుమాని నాగమణి 39 వార్డు

చంద్రబాబు వస్తే మళ్లీ తిప్పలే



ఇదివరకెప్పుడే రూ.70 పింఛను ఇచ్చినప్పుడు ఇలా తిరగాల్సి వచ్చేది. ఈ ఐదేళ్లు చాలా సుఖంగా పింఛను ఇంటి గుమ్మంలోకే పంపాడు మా జగన్‌బాబు. చంద్రబాబు చేసిన పనికి మా ముసలోళ్లం ఇలా కళ్లుతిరిగిపడిపోయేలా రోడ్లట్టుకుని తిరగాల్సి వస్తోంది. ముసలోళ్లను ఇబ్బంది పెట్టి చంద్రబాబు ఏం బాగుపడతాడు. ఈ పింఛను డబ్బు తీసుకుని ఇంట్లోకి వెచ్చాలు, మందులు కొనుక్కోవాలి.

– అబ్బసాని పిచ్చమ్మ, తణుకు

తొలిరోజు 213 మంది ఓటేశారు

8వ తేదీ వరకు కొనసాగనున్న హోం ఓటింగ్



ఉండి మండలం కలిగొట్లలో ఇంటి వద్దే ఓటు వేస్తున్న 97 ఏళ్ల సాగిరాజు వెంకటరాజు



పోడూరు మండలం జగన్నాథపురంలో ఇంటి వద్దే ఓటు వేస్తున్న 85 ఏళ్ల కె.వెంకటనర్సమ్మ

భీమవరం(ప్రకాశం చౌక్): దేశంలోనే తొలిసారిగా ఇంటి వద్దే ఓటు వేసే అవకాశాన్ని కల్పించిన క్రమంలో జిల్లాలో తొలిరోజు శుక్రవారం 213 మంది హోం ఓటింగ్ ప్రక్రియలో భాగంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి 85 సంవత్సరాలు పైబడిన వారు, 40 శాతం కన్నా ఎక్కువ వైకల్యం ఉన్న వారికి ఎన్నికల కమిషన్ హోమ్ ఓటింగ్ సౌకర్యాన్ని కల్పించింది. దీంతో జిల్లాలో 85 ఏళ్లు దాటిన వారు, దివ్యాంగులు కొందరు ఇంటి వద్దే ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి 8 తేదీ వరకు ఇంటి వద్దే ఓటింగ్ వేసే అవకాశం దక్కింది. హోమ్ ఓటింగ్‌కు సంబంధించి పోలింగ్ అధికారి, సహాయ పోలింగ్ అధికారి, సూక్ష్మ పరిశీలకుడు, వీడియోగ్రాఫర్, ఆర్మీ కానిస్టేబుల్ సమక్షంలో పగడ్బందీగా ఓటింగ్ పక్రియ నిర్వహిస్తున్నారు. ప్రత్యేక పోలింగ్ కంపార్ట్‌మెంట్‌లో ఓటును వేయించి సీల్డు కవర్లో అధికారుల సమక్షంలోనే సీల్డ్ డ్రమ్ములో భద్రపరుస్తున్నారు. జిల్లాలో 85 ఏళ్లు దాటిన వారు 7,050 మంది ఉండగా వారిలో 562 మంది హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా, వీరిలో తొలిరోజు 98 తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే జిల్లాలో దివ్యాంగులు 18,807 మంది ఉండగా, వీరిలో 591 మంది హోమ్ ఓటింగ్‌కు ధరఖాస్తు చేసుకున్నారు. వారిలో మొదటి రోజు 115 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

వృద్ధులు, దివ్యాంగుల్లో హర్షం

ఎన్నికల కమిషన్ మొటమొదటిగా ఇంటి వద్దే ఓటింగ్ వేసుకునే సౌకర్యాన్ని కల్పించడంపై 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కదల్లేని స్థితిలో ఉన్న వృద్ధులకు, పోలింగ్ బూత్‌లకు వెళ్లడానికి ఇబ్బందులు పడే దివ్యాంగులకు హోమ్ ఓటింగ్ సౌకర్యం బాగుందని అంటున్నారు. పోలింగ్ విధానంలో ఇలాంటి మార్పులు రావడం మంచి పరిణామం అంటున్నారు. దీని వల్ల ఓటు వేయడానికి పడే ఇబ్బందులు తొలగాయని చెబుతున్నారు.

గందరగోళంగా కూటమి న్యాయవాదుల ఆత్మీయ సమావేశం

భీమవరం: ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో శుక్రవారం నిర్వహించిన కూటమి న్యాయవాదుల ఆత్మీయ సమావేశం గందరగోళంగా మారింది. సమావేశానికి బీజేపీ ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ గైర్హాజరు కాగా, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావును వేదికపైకి పిలవకపోవడం గమనార్హం. అతిథిగా హాజరైన టీడీపీ ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి కనుమూరు రఘురామకృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలు న్యాయవాదులను ఆగ్రహానికి గురిచేశాయి. చాలా మంది న్యాయవాదులు ప్రాక్టీసు చేయరని రెగ్యులర్‌గా కోర్టులకు హాజరుకారని, తాను మాత్రం కోర్టు పక్షినని, వివిధ కేసుల్లో కోర్టుల చుట్టూ తిరుగుతూ పెద్దమొత్తంలో ఖర్చుచేశానని చెప్పడం గమనార్హం. ఓట్లు కోసం వచ్చి తమకు ఓట్లు వేయాలని అడగడం గాకుండా న్యాయవాదులను కించపర్చే విధంగా మాట్లాడడం ఏమిటని, ఇటువంటివారికి ఓట్లు ఎలా వేయాలంటూ గుసగుసలు విన్పించాయి.

అవ్వాతాతల పాలిట యముడు చంద్రబాబు

విలేకరుల సమావేశంలో మంత్రి కారుమూరి మండిపాటు



తణుకు అర్బన్: అవ్వాతాతలపై చంద్రబాబు పగబట్టి వారి పట్ల యముడిలా ప్రవర్తిస్తున్నాడని రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. తణుకులో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రానికి చంద్రబాబు దుష్టగ్రహంలా దాపురించాడని, పేదలు, వృద్ధులు సుఖంగా ఉంటే చూడలేకపోతున్నాడని విమర్శించారు. గత ఐదేళ్లుగా వలంటీర్ వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి గుమ్మంలోకే ఇచ్చిన పింఛన్ పంపిణీ విధానాన్ని చంద్రబాబు జీర్ణించుకోలేకపోయాడని, పరిపాలన ఎన్నికల అధికారి చేతుల్లోకి వెళ్లిన వెంటనే తన కుట్ర రాజకీయాన్ని బయటకు తీశాడని దుయ్యబట్టారు. తన హయాంలో ఎన్నికల అధికారి వేషంలో తొత్తుగా పనిచేసిన నిమ్మగడ్డ రమేష్ ద్వారా అవ్వాతాతలు, మహిళలపై యమపాశంలాంటి పిటిషన్‌ను వేసి ఇంటి గుమ్మంలోకి అందించే పింఛను విధానాన్ని అడ్డుకున్నాడని ఎద్దేవా చేశారు. ఎన్నికల కోడ్ అమలైన రోజు నుంచి తనలోని దుష్టచతురతను బయటకు తీసి పేదలను ఎలా ఇబ్బంది పెట్టాలా అని ఆలోచిస్తూ పదే పదే పిటిషన్‌లు వేస్తూ అవ్వాతాతల ఉసురు తీస్తున్నాడని అన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రచార ఆర్భాటం కోసం గోదావరి పుష్కరాల్లో 39 మంది అమాయక ప్రజల్ని పొట్టనపెట్టుకున్నాడని, ఈ ఏడాది ఏప్రిల్‌లో పింఛను కోసం సచివాలయాలకు రప్పించి రాష్ట్ర వ్యాప్తంగా 30 మందికి పైగా అవ్వాతాతలను బలితీసుకున్నాడని, ఈ నెలలో ఇంకెంత మందిని బలి తీసుకుంటాడోనని ఆందోళన వ్యక్తం చేశారు. మొదటి పిటిషన్‌తో పింఛనును సచివాలయాలకు వచ్చి తీసుకోవాలని ఆదేశాలు ఇప్పించాడని, రెండో పిటిషన్ ద్వారా పింఛను సొమ్మును బ్యాంకులకు జమచేసేలా సఫలీకృతుడై శునకానందం పొందుతున్నాడన్నారు. అవ్వాతాతలపై చంద్రబాబు చేస్తున్న కుట్ర రాజకీయాలను ప్రజలంతా గమనిస్తున్నారని, ఇంతకింత అనుభవించే రోజు తొందరలోనే ఉందని గుర్తుచేశారు. పింఛను సొమ్ము తీసుకుని మందులు, వెచ్చాలు కొనుక్కునే క్రమంలో బ్యాంకులకు వచ్చిన అవ్వాతాతలు తాము పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా చంద్రబాబుపై శాపనార్థాలు పెడుతున్నారని, వలంటీర్లు ఇస్తే నీ ఆస్తేమైనా కరిగిపోతుందా అంటూ నిప్పులు చెరుగుతున్నారని మంత్రి కారుమూరి స్పష్టం చేశారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు



వైఎస్సార్ సీపీలోకి పాలూరి శివను ఆహ్వానిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



పీవీఎల్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన ఆకివీడు టీడీపీ నాయకులు, కార్యకర్తలు

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఈలి వెంకటమధుసూదనరావు (ఈలినాని) ఆధ్వర్యంలో మంత్రి కొట్టు సత్యనారాయణ సమక్షంలో శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. పట్టణంలో టీడీపీ మాజీ కౌన్సిలర్ మారిశెట్టి సుబ్బారావుతోపాటు అతని అనుచరులు సుమారు 100 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. బీజేపీ, జనసేన పార్టీల నుంచి నీలగిరి వరలక్ష్మి, మరో 250 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మంత్రి కొట్టు పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి కొట్టు మాట్లాడుతూ ఈ నెల 13 జరిగే ఎన్నికల్లో ప్రత్యర్థి జనసేన పార్టీ అభ్యర్థి వెనుక అందరూ రౌడీలు, గుండాలు, సెటిల్‌మెంట్ బ్యాచ్‌లు, అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడేవారే ఉన్నారన్నారు. గూడెం ప్రజలందరూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలన్నారు.



కొట్టు సమక్షంలో చేరిన తాడేపల్లిగూడెం ఆటో యూనియన్ వర్కర్స్, ఓనర్స్

మాజీ ఎమ్మెల్యే ఈలి వెంకట మధుసూదనరావు (నాని), అప్పడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం, కొట్టు తాతాజీ, నిమ్మల నాని, గొర్రెల శ్రీనివాస్, బండారు నాగు, మార్నీడి వెంకన్న, బొద్దు సాయిబాబా, తాళ్ళ ప్రసాద్, చెన్నా జగనార్దన్, మానికొండ వెంకటేశ్వరరావు, మల్లుల విజయ్, నీలగిరి వరలక్ష్మి, రజని, తిరగం రమాదేవి, ఆరమిల్లి రవి, దాసి బాబు పాల్గొన్నారు.

జనసేన పాలూరు శివ యూత్ చేరిక

తాడేపల్లిగూడెం అర్బన్ : గాంధీబొమ్మ సెంటర్ ప్రాంతానికి చెందిన పాలూరి శివ యూత్ శుక్రవారం ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సమక్షంలో పాలూరి శివతోపాటు అతని అనుచరులు, స్నేహితులు సుమారు 100 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరిని కొట్టు సత్యనారాయణ పార్టీ కండువాలతో ఆహ్వానించారు. రూపేంద్ర, నాగరాజు, సూరజ్, హర్ష, లోవరాజు సాయి, గిద్రోని, అజయ్, పెందుర్తి జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

పీవీఎల్ సమక్షంలో..

కాళ్ల: ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు సమక్షంలో ఆకివీడుకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైస్సార్ సీపీ నాయకులు కనుమూరి ఆనందవర్మ, కౌన్సిలర్ వంగా జ్యోత్స్న ఆధ్వర్యంలో 50 మంది శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు.

క్లుప్తంగా

నేడు అత్తిలిలో మంత్రి కారుమూరి ఎన్నికల ప్రచార ర్యాలీ

అత్తిలి: తణుకు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కారుమూరి నాగేశ్వరరావు, నర్సాపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల ఎన్నికల ప్రచారం శనివారం అత్తిలి మండలంలో జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. మధ్యాహ్నం భారీ మోటారు సైకిల్ ర్యాలీ వరిఘేడు గ్రామం నుంచి ప్రారంభమై ఎర్రనీలిగుంట, గుమ్మంపాడు, బల్లిపాడు, తిరుపతిపురం, ఉరదాళ్ల పాలెం గ్రామం వరకు సాగుతుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఈకార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పైబోయిన కోరారు.

మారెమ్మకు వెండి కిరీటం సమర్పణ


యానాలపల్లి మారెమ్మకు వెండి కిరీటం సమర్పిస్తున్న దాతలు

పెంటపాడు: మండలంలోని యానాలపల్లి గ్రామ దేవత మరిడిమారెమ్మ అమ్మవారికి గ్రామానికి చెందిన దాతలు తాడి శ్రీనివాస్(అడ్వకేట్) విజయలక్ష్మి, నారాయణమూర్తి, గంగాభవాని దంపతులు రూ. 2 లక్షల వెండి కిరీటం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఛాయాదేవి, కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, తాడి సత్తిబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొణ తాల వెంకట్రావు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన చేశారు.

గూడెం అభివృద్ధి కొట్టుతోనే సాధ్యం

పెంటపాడు: తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధి కొట్టు సత్యనారాయణతోనే సాధ్యమని పార్టీ మండల శాఖ పూర్వాధ్యక్షుడు వీర్ల గోవింద్ తెలిపారు. పార్టీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి కాగులంపాడు, జగనన్న కాలనీ, బ్యాంక్ ప్రాంతాలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగనన్న చేపట్టిన పలు పథకాలను ప్రజలకు వివరించారు. గూడెంలో కొట్టు సత్యనారాయణకు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీర్ల వెంకటేష్, దేవాలయ చైర్మన్ సైపురెడ్డి రాంబాబు, వీర్ల సత్యనారాయణ, ఎస్సీ నాయకులు, ప్రత్తిపాడు యూత్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పని ప్రాంతంలో మజ్జిగ, మంచినీరు అందించాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకం పని ప్రాంతంలో మజ్జిగ, మంచినీరు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని మెట్ట ఉప్పరగూడెం , ఇటుకులగుంట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించి, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు తమకు ఇప్పటి వరకు చూపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కండెల్లి సోమరాజు మాట్లాడుతూ పాధి హామీ పథకానికి బడ్జెట్‌లో రూ.2లక్షల కోట్లు కేటాయించాలని, ప్రతీ కుటుంబానికి 200 రోజులు పనిదినాలు కల్పించాలని, రూ.600లు కూలి ఇవ్వాలని, సమ్మర్ అలవెన్స్‌లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాలుపూరి శారద, ఉక్కుసూరి రామలక్ష్మి, గుండుమోలు బులి లక్ష్మి, పాలుపూరి దేవి, రూతు కుమారి, అవిశెట్టి మరియమ్మ, వెలుగంటి మంగ, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి


రావిపాడు సెంటర్‌లో ఎన్నికల ప్రచారం పాల్గొన్న యువనేత కొట్టు విశాల్

పెంటపాడు: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు మళ్లీ కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్ పేర్కొన్నారు. పెంటపాడు మండలంలో శుక్రవారం బోడపాడు, బిళ్లగుంట, దర్శిపర్రు, వల్లూరుపల్లి, రాచర్ల, రావిపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి కొట్టు సత్యనారాయణను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కైగాల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, బోడపాడు సర్పంచ్ గేదల శివ, రాచర్ల సర్పంచ్ వాకా దుర్గాభవాని, ఎంపీటీసీ సభ్యులు కొణతాల వెంకట్రావు, చింతన శారద, తోట నిరీక్షణరావు, బొచ్చెల తాతారావు, దెయ్యం శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు కుంచే సుబ్రహ్మణ్యం, కైగాల గణపతి, పార్టీ సీనియర్ నాయకులు దేవ వెంకటరమణ, ములగాల బాబ్జి, డెక్కపాటి రమణ, వింజమూరి శ్రీనివాస్, గుండుమోగుల మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు అందక ఇక్కట్లు..!

బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు


మాధవరం బ్యాంకు వద్ద పింఛన్ సొమ్ము కోసం పడిగాపులు పడుతున్న పింఛన్‌దారులు


తేతలిలోని ఇండియన్ బ్యాంక్ వద్ద వృద్ధులకు మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో పలువురు పింఛన్‌దారులకు పింఛన్ అందక ఇక్కట్లు పడుతున్నారు. మే నెలకు సంబంధించి పింఛన్‌ను లబ్ధిదారుల ఖాతాలకు, లేకుంటే నేరుగా అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు తాడేపల్లిగూడెం మండలంలో మంచానికే పరిమితమైన వారు, నడవలేని వృద్ధులకు, పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. మిగిలిన లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాలకు పింఛన్ సొమ్ము జమ కావలసి ఉంది. అయితే, కొందరికి ఆధార్‌తో బ్యాంకు అకౌంట్ అనుసంధానం కాకపోవడం, బ్యాంకు అకౌంట్ మనుగడలో లేకపోవడం వంటి కారణాలతో పింఛన్ సొమ్ము జమ కాలేదని తెలుస్తోంది. ఇదిలాఉంటే, జగ్గన్నపేట, రామన్నగూడెం, మెట్ట ఉప్పరగూడెం, అమృతపురం, ఇటుకులగుంట, గొల్లగూడెం, అప్పారావుపేట, ఉప్పరగూడెం, నందమూరు, ఆరుళ్ళ, చినతాడేపల్లి, బంగారుగూడెం తదితర గ్రామాల్లో బ్యాంకులు లేకపోవడంతో సమీపంలోని గ్రామాలకు, తాడేపల్లిగూడెం పట్టణానికి రాకపోకలు సాగించవలసి వస్తుంది. ఇలా ఒక గ్రామం నుంచి మరొక గ్రామం కాళ్లరిగేలా తిరుగుతున్న పింఛన్లు అందక ఇబ్బంది పడుతున్నారు. ప్రతి నెలా ఒకటవ తేదిన పింఛన్ అందుకునే పింఛన్‌దారులు మే నెల 3వ తేది గడుస్తున్న పింఛన్ అందకపోవడంతో ఆవేదన చెందుతున్నారు.

పింఛన్ల కోసం వృద్ధుల అవస్థలు

తణుకు టౌన్: వలంటీర్ల వ్యవస్థ ద్వారా సజావుగా జరుగుతున్న పింఛన్ల పంపిణీని అడ్డుకున్న టీడీపీ, జనసేన కూటమిపై ఫించన్ దారులు దుమ్మెత్తి పోస్తున్నారు. వలంటీర్ల వ్యవస్థతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును చూసి ఓర్వలేని ఆ పార్టీలు మొదటి నుంచి ఆ వ్యవస్థపై లేనిపోని ఆరోపణలు చేస్తూ వస్తున్నారు. అయితే గత నెలలో వలంటీర్లను పక్కన పెట్టాలని ఎన్నికల కమీషన్‌కు చెప్పి ఈ దుష్టచతుష్టయం తాజాగా ఫించన్ల పంపిణీ బ్యాంకు ఖాతాల్లో వేయాలని ఈసీకి ఫిర్యాదు చేయడంతో ఈ నెల పింఛన్లు అధికారులు బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. అయితే వాటిని తీసుకునేందుకు అవ్వతాతలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కాదు. మండుటెండల్లో బ్యాంకుల నుంచి వెనుతిరుగుతున్నారు. అయితే బ్యాంక్‌ల వద్ద ఎండలో పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు పడుతున్న అవస్థలు చూడలేక తేతలి గ్రామంలో ఇండియన్ బ్యాంక్ వద్ద పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న వృద్ధులకు గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటనాగేశ్వరరావు ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నాం



పింఛన్ కోసం బ్యాంకులు, బిజినెస్ సెంటర్ల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాం. ఇప్పటికే నాలుగు సార్లు తిరగాల్సి వచ్చింది. గత నెల సచివాలయం వద్ద ఇచ్చారు. ఇప్పుడు బ్యాంకు ఖాతాల పేరుతో ఇబ్బంది పడుతున్నాం. ఈ ఇబ్బందిని తొలగించాలి.
– కోసూరి వీరాస్వామి, మెట్ట ఉప్పరగూడెం, తాడేపల్లిగూడెం మండలం

అడ్డంకులు సృష్టించడం సరికాదు



తెల్లవారు జామున ఇంటివద్ద వలంటీర్లు పింఛన్లు అందజేసేవారు. రాజకీయ నాయకులు తమ ప్రాభవం కోసం పింఛన్ల పంపిణీకి ఆటంకం సృష్టించడం సరికాదు. ఇప్పటికైనా, అధికారులు స్పందించి ఇంటివద్దనే పింఛన్లు అందజేసేలా చర్యలు తీసుకోవాలి.
– కోరశిఖ పోతురాజు, గొల్లగూడెం, తాడేపల్లిగూడెం మండలం

మళ్లీ వచ్చేది జగన్ ప్రభుత్వమే

మాజీ ఎమ్మెల్యే ఈలి నాని


24, 25 వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈలి నాని

తాడేపల్లిగూడెం అర్బన్: గతంలో ఏ ప్రభుత్వం కూడా చేయని ప్రజా సంక్షేమం కార్యక్రమాలు ప్రస్తుత ప్రభుత్వంలో పారదర్శకంగా కొనసాగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈలి వెంకట మధుసూదనరావు (నాని) అన్నారు. పట్టణంలోని 24, 25 వార్డుల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డుల్లో ఈలి నాని మాట్లాడుతూ సీఎం జగన్ గొప్ప మానవతావాది అని చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం ప్రభుత్వానికి నాలు మూల స్తంబాలు వంటివి అని పేర్కొన్నారు. సంక్షేమ యుగ పురుషుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తు మీద ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యేలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఎవరెవరికి ఎంతో మేలు చేకూరిందో వివరిస్తూ..మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించిన కొట్టు సత్యనారాయణ సమర్థుడైన నాయకుడిగా ప్రజలు అభిమానిస్తున్నారన్నారు. ఈ నెల 13 నిర్వహించే ఎన్నికల్లో కొట్టును మళ్ళీ గెలిపించుకుంటే మన తాడేపల్లిగూడెం పట్టణంతోపాటు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యజ్జల రాంబాబు, మల్లుల విజయ్, పిల్లా నర్సింహరావు, దాసరి రాజా, అశోక్, హరిదాసుల రవీంద్రకుమార్, లాయర్ రామకృష్ణ, బోణం విజయనిర్మల, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ఇంటింటికీ సంక్షేమ లబ్ధి


మండపాక గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు

ఇరగవరం: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని జెడ్పీటీసీ పంపన అంజిబాబు అన్నారు. శుక్రవారం ఇరగవరం మండలంలోని ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వెలగల సాయిబాబా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, కె ఇల్లిందలపర్రు, ఇరగవరం సొసైటి అధ్యక్షులు మల్లిరెడ్డి నాగార్జున, చవ్వాకులు శ్రీనివాస్, సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, ఎఎంసీ ఉపాధ్యక్షులు మమిడి శెట్టి శ్రీనివాస్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కుడిపూడి నాగ సత్యనారాయణ, కడలి కుమార్, శీలబోయిన శ్రీనివాస్, బొక్క శ్రీనివాస్, గంధం దానయ్య, పాల పాలేశ్వరరావు, జక్కంశెట్టి రాంబాబు, కౌరు తాతరావు, వీరవల్లి రామ కృష్ణ, మురళీ కృష్ణ ,ఆయా గ్రామాల్లోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామా పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా గ్రామాల్లో ఎన్నికల ప్రచారాలు

తణుకు టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికలలో తణుకు ఎమ్మెల్యేగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, నరసాపురం ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమా బాలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, సొసైటీ అధ్యక్షురాలు వై విజయామూర్తి, ఎంపీటీసీ కాళ్ల సన్యాసిరావు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న నైజం జగనన్న సొంతం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెడుతున్న చంద్రబాబు



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ


1వ వార్డు మిలటరీ కాలనీలో ప్రసంగిస్తున్న కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : మేనిఫెస్టో ప్రకటించి ప్రతి ఒక్కరి హామీని తూచా తప్పకుండా అమలు చేసిన నైజం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సొంతమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ తెలిపారు. 31,2,3,4,5,6,7,8,9,33 వార్డుల్లో మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారా యణ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించారని తెలిపారు. మంత్రి పైడికొండల మాణిక్యాలరావు తాడేపల్లిగూడెంను జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేశారన్నారు. ఆయనను ముందుకు వెళ్లనీయకుండా అడుగడుగునా ముళ్ళపూడి బాపిరాజుతో కలిసి అడ్డుపడిన వ్యక్తి బొలిశెట్టి అని ఆరోపించారు. తాను రెండవసారి ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం తాడేపల్లిగూడెం పట్టణంతోపాటు నియోజకవర్గాన్ని రూ. 3000వేల కోట్లు నిధులతో అభివృద్ధి పనులు చేశామన్నారు. మళ్ళీ తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఇంతకు మించి అభివృద్ధి చేస్తామన్నారు. జగనన్న పాలనలో సంక్షేమం ప్రతి ఇంటింటికీ అందిందని, కుల, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలుచేసిన తీరును ఒక్కసారి గమనించాలని కోరారు. గతంలో ఏ ప్రభుత్వం ఇంతపెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. వలంటీరు వ్యవస్థను విమర్శించిన చంద్రబాబు మళ్లీ జగన్ బాటలోకే వచ్చిన విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో వట్టి బుజ్జి, తాతా శ్రీనివాస్, గొర్రెల శ్రీనివాస్, బండారు నాగు, నిమ్మల నాని, మార్నీడి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అందజేశాం

గూడెం నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు అందజేశామని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ తాను మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం 1వవార్డులోని మిలటరీ కాలనీ, రాళ్ల సాహెబ్ కాలనీలకు మౌలిక సౌకర్యాలు కల్పించామన్నారు. మళ్లీ తాను రెండవసారి ఎమ్మెల్యేగా గెలిచేవరకు ఆ ప్రాంత వాసులను ఎవ్వరూ పట్టించుకోలేదన్నారు. ఇటీవల కాలంలో నీటి ఎద్దడిని నివారించేందుకు నూతనంగా భారీ పైపులైన్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 13వతేదీన నిర్వహించే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, నర్సాపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, అప్పడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాంనాయుడు, కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, వడ్డి శేషు, పాలూరి శివ యూత్, మిద్దే ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనలకు భారీ షాక్

తాడేపల్లిగూడెం: నియోజకవర్గంలో టీడీపీ, జనసేన పార్టీలకు భారీ షాక్ తగిలింది. శుక్రవారం టీడీపి నుంచి సీనియర్ నాయకులు, జనసేన యువ నాయకులు వందల సంఖ్యలో డిప్యూటీసీఎం కొట్టు సత్యనారాయణ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, సీనియర్ టీడీపి నాయకుడు మారిశెట్టి సుబ్బారావు తన అనుచరులు 200 మందితో కలిసి శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఈలి నానితో డిప్యూటీసీఎం కొట్టు సత్యనారాయణ, అప్పడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం నాయుడు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. జనసేనకు పట్టణంలో గట్టి దెబ్బ తగిలింది. 4,5,6 వార్డుల కూడలి గాంధీబొమ్మ సెంటర్‌కు చెందిన పాలూరి శివ యూత్ మంత్రి కొట్టు సత్యనారాయణ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కొట్టు సత్యనారాయణ విజయానికి తాము పనిచేస్తామని యూత్ నాయకులు పాలూరి సాంబశివరావు తెలిపారు. వంద మంది యువకులు పార్టీలో చేరడం ఆనందంగా ఉందని, వారికి అండగా ఉంటానని మంత్రి హామీ ఇచ్చారు.

సీఎంను హెలీప్యాడ్ వద్ద కలిసిన మంత్రి కారుమూరి


నరసాపురంలో హెలిప్యాడ్ వద్ద సీఎంను కలిసిన మంత్రి కారుమూరి

నరసాపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిను నరసాపురంలో హెలీప్యాడ్ వద్ద మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పార్టీ ఉభయ గోదావరి జిల్లాల కో–ఆర్డినేటర్ ఎంపీ మిథున్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు సమస్యలపై చర్చించారు.

ముగిసిన మరిడి మారెమ్మ ఉత్సవాలు

పెంటపాడు: మండలంలోని యానాలపల్లి గ్రామంలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న గ్రామ దేవత మరిడి మారెమ్మ ఉత్సవాలు ముగిసాయి. ఈ సందర్భంగా శుక్రవారం అమ్మవారికి భారీగా కలశాభిషేకం నిర్వహించారు. గ్రామ వీధులతో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు.

సంక్షేమం అందాలంటే మళ్లీ జగనే రావాలి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు


తణుకులో ఎన్నికల ప్రచారంలో పసిబిడ్డను ఎత్తుకున్న మంత్రి కారుమూరి


కొనాల ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు అర్బన్: పేదలందరికీ సంక్షేమం పారదర్శకంగా అందాలంటే సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాలని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 9వ వార్డులో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మంత్రి కారుమూరి పాల్గొని మాట్లాడారు. పేదల పక్షాన నిలబడి వారి అవసరాలను గుర్తించి సంక్షేమం రూపంలో ఇంటి గుమ్మంలోకే పంపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారని అన్నారు. చంద్రబాబు హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 35 లక్షల మందికి పింఛన్లు అందిస్తే నేడు రూ. 66 లక్షల పింఛన్లు ఇస్తున్న ఘనత కూడా జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. అవినీతికి తావులేకుండా అర్హులందరికీ పథకాలు వర్తింపచేసే విధానం దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, కాపు సంఘ అధ్యక్షుడు వంటిద్దు ఈశ్వరప్రసాద్, తాటిపర్తి వాసు, పిల్లి సూరిబాబు, పోలిశెట్టి వెంకన్నబాబు, పంపన సుబ్బారావు, కుడుపూడి చంద్రరావు, చింతాడ సంజీవరావు, అలిషేక్, నారాయణ, [illegible] సింహాద్రి, సప్పా శ్రీనివాస్ పాల్గొన్నారు.

అందరికీ మంచి చేసిన నేత సీఎం జగన్

తణుకు అర్బన్: కులం, మతం, పార్టీ బేధాల్లేకుండా అర్హులందరికీ మంచి చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే చెల్లుతుందని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు సురాజ్య భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ది తణుకు ప్రింటర్స్ అసోసియేషన్ నాయకులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మంత్రి కారుమూరి మాట్లాడారు. ప్రజల గుమ్మంలోకి వెళ్లి సేవలందించే మంచి వాతావరణాన్ని సీఎం జగన్ ఏపీలో కలుగచేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రఘుమండ రవీంద్రనాథ్, కార్యదర్శి బెల్లంకొండ శ్రీనివాసరావు, కోశాధికారి నంబూరి శ్రీహరి, ఉపాధ్యక్షుడు తమ్మిశెట్టి వీరవెంకట సుబ్బారావు, సహాయ కార్యదర్శి మల్లాది కనక పవన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పార్టీ నాయకులు డి.ప్రకాష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనే రావాలి

తణుకు టౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా ఉంటేనే పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శుక్రవారం సాయంత్రం తణుకు రూరల్ మండలం కోనాల, ముద్దాపురం, దువ్వ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ పాలనలో కోనాల గ్రామంలో రాక్షస పాలన సాగిందని వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమ పాలన సాగిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేశారని చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరిన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందజేసేందుకు జగన్ కృషి చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, ఎంపీపీ రుద్ర దనరాజు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, కోనాల గ్రామ సర్పంచ్ మల్లిపూడి చిన్నయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు బాబి, బాబ్జి, ముద్దాపురం గ్రామ సర్పంచ్ మజ్జి పద్మ, గ్రామ కమిటీ అధ్యక్షుడు తుమ్మగంటి సత్యనారాయణ, దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, సొసైటీ అధ్యక్షుడు జేకే రాజు, మండల రైతు విభాగం అధ్యక్షుడు దండు కృష్ణంరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపాల కృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాకు అన్ని పథకాలూ అందాయి



జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలతో మా కుటుంబం ఎంతో ఆనందంగా ఉంది. ఇంటి స్థలం, డ్వాక్రా రుణమాఫీ, అమ్మఒడి, చేయూత, రైతు భరోసా, పంటల బీమా ఇలా మా కుటుంబానికి అన్ని పథకాలు అందాయి. ఏ ప్రభుత్వం చేయలేని సంక్షేమం, అభివృద్ధి జగనన్న చేశాడు. జగనన్న మళ్లీ వస్తే మాలాంటి కుటుంబాల్లో మరింత సంతోషం వెల్లివిరుస్తుంది.

– డి రాధ, మల్లవరం

జగన్‌ను చూశాకే ఇంటికి వెళతా



మొన్నటి వరకూ ఇంటికి వచ్చి పెన్షన్ ఇచ్చేవారు. గత నెల, ఈ నెల పెన్షన్ తీసుకోవడానికి సచివాలయానికి, బ్యాంకుకు వెళ్లాల్సి వచ్చింది. జగన్‌బాబు వస్తేనే మళ్లీ మాకు పెన్షన్లు ఇంటికి వస్తాయి. పథకాలను ఇంటింటికి అందించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నరసాపురం వస్తున్నారనే తెలిసి ఉదయాన్నే బయలుదేరి వచ్చాను. జగన్‌బాబును చూసిన తరువాతే ఇంటికి వెళతా.

– లంకా పద్మ, లక్ష్మణేశ్వరం

జగన్ పాలనలో అవినీతి లేదు



మా కుటుంబంలో చేయూత వస్తుంది, నాకు పెన్షన్ వస్తుంది. గత ఐదేళ్లుగా మా కుటుంబంలో అనేక పథకాలు అందుకుంటు న్నాము. గతంలో ఏ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగేవాళ్లం. ఏదైనా పథకం అందాలంటే వాటిలో సగం వారికి ముట్టజెప్పాల్సి వచ్చేది. జగన్‌బాబు ప్రభుత్వంలో ఎక్కడా అవినీతి లేకుండా ఇంటికి వచ్చి పథకాలు అందజేస్తున్నారు.

– బాలం సత్యవతి, లక్ష్మణేశ్వరం, జోనా నగర్


జగనన్నను చూడాలని వచ్చా



మా అమ్మాయికి సొంతింటి కల నెరవేరింది. **నాకు పెన్షన్** వస్తుంది. అమ్మఒడి పథకం అందుతుంది. తద్వారా **మా మనవ** ళ్లకు మెరుగైన విద్య అందుతుంది. పిల్లల చదువు**కు రూపాయి** కూడా ఖర్చు లేకుండానే విద్య కొనసాగుతుంది. ప్ర**జలకు ఇంత** మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను చూడాల**ని ఇక్కడకు** వచ్చాను.

– శీలంకి పార్వతి, **నరసాపురం**

ఎంతసేపైనా ఎదురుచూస్తా



జగన్‌బాబు వల్ల అన్ని కుటుంబాలు బాగున్నాయి. మంచి పరిపాలన అందిస్తున్నాడు. ఇంత సంక్షేమాన్ని అందిస్తున్న జగన్‌ను చూడాలని 20 కిలోమీటర్ల దూరంనుంచి ఎండలో వచ్చాను. ఎంత టైం అయినా, ఎంత వేడైనా జగన్‌ను కనులారా చూసే వెళతాను. ఆయన వల్లే నాకు పించన్ వస్తుంది. ఇంటామెకు డ్వాక్రా రుణం అందింది. మనవడికి అమ్మ ఒడి డబ్బులు వస్తున్నాయి.

– పెంటపాటి సత్యనారాయణ, పేరుపాలెం

ఓటుతో అండగా నిలుస్తాం



మా లాంటి యువతకు జగనన్న ఒక బ్రాండు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలు, అన్ని వర్ణాలను కలుపుకుని మాలాంటి యువతకు ఆదర్శంగా కనిపించే నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి ఒక్కడే. అటువంటి నాయకుడికి ఓటు హక్కుతో అండగా నిలుస్తాం. ప్రజలకు మరింత చేరువవ్వాలనే ఫ్యాను గుర్తును తలకు కట్టుకున్నా.

– ఏలూరి చంద్ర శేఖర్, చిట్టవరం

వైఎస్సార్‌కు తగ్గ తనయుడు



చనిపోయి ఏ లోకాన ఉన్నాడో.. ప్రజల కోసం ఎప్పుడూ పరితపించిన దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డికి తగ్గ తనయుడిగా జగన్ బాబు మా అందరి హృదయాలను గెలిచేలా పరిపాలన అందిస్తున్నాడు. మాకు ఏదైతే చెయ్యగలడో అదే చెప్పి దాన్ని నూరుశాతం అమలు చేసిన ఏకైక నాయకుడు జగన్‌బాబే. జగన్‌ను చూడడానికే తీరప్రాంత గ్రామమైన వేములదీవి నుంచి వచ్చాము.

– తిరుమాని విజయలక్ష్మి, వేములదీవి

మత్స్యకారులకు జగనే భరోసా



మత్స్యకారులకు ఎంతో భరోసా కల్పించిన నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమే. అమలుకాని హామీలను ఇచ్చి మోసం చేయాలనే ఉద్దేశం లేదు కాబట్టే ఏ పథకం ఇస్తాడో అదే చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పథకాలను అమలు చేసి చూపించాడు. అంతే కాకుండా మా ఊరి దగ్గర్లో హార్బర్ కడతారని అంటున్నారు. దానివల్ల మా జీవితాలు మరింత పెరుగుతాయని మా వాళ్లంతా అనుకుంటున్నారు.

– తిరుమాని లక్ష్మి, రామాంజనేయపురం

ఆసుపత్రులు ఎంత బాగుపడ్డాయో..



నరసాపురంలో ప్రభుత్వ ఆసుపత్రిని తీర్చిదిద్దడం వల్లే ఈరోజు మెరుగైన వైద్యం అందుతుంది. నాకు పక్షవాతం వచ్చినప్పుడు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లే స్థోమత లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రికే వెళ్లాను. అక్కడ అందించిన సేవలతోనే నేను బతికి బయటపడ్డా. అందుకే ఈ రోజు జగనన్నను చూడడానికి రాగలిగాను. ఆసుపత్రులు, విద్యా సంస్థలు ఎంత బాగుపడ్డాయో వాటిని ఉపయోగించుకున్న నాలాంటి వారికే తెలుస్తుంది.

– కొల్లాటి చిన్న, ఎల్‌బీ చర్ల



జగనన్న మా ఆరాధ్య దైవం

కాపుల ఆరాధ్యదైవం వంగవీటి మోహన్‌రంగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రసాదరాజు కలిసి ఉన్న ఫ్లెక్సీతో పట్టణానికి చెందిన మణికంఠ అనే యువకుడు తన మిత్రులతో కలిసి సందడి చేశాడు. దిస్ టైమ్ 175 టార్గెట్ అంటూ పట్టణ పుర వీధుల్లో యువకులు కేరింతలు కొడుతూ ఊరేగింపు నిర్వహించారు. జగనన్న మా ఆరాధ్య దైవం అంటూ నినాదాలు చేశారు.

మణికంఠ, నరసాపురం



ఉప్పొంగిన అభిమానం

తీరప్రాంతం జగనాభిమానంతో ఉప్పొంగింది. పథకాలతో తమ జీవితాలను నిలబెట్టిన సంక్షేమ సారథిని చూసేందుకు అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. మండుటెండను సైతం లెక్కజేయకపోవడం విశేషం. అవినీతి, సిఫార్సులు అంటూ ఏమీ లేకుండా కుల, మత, వర్గ భేదాలు చూడకుండా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన మా జగనన్న అంటూ ప్రజలు గర్వంగా చెప్పుకుంటున్నారు. మా ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటాం.. చంద్రబాబు కూటమిని తరిమికొడతాం అంటూ నినదించారు.

– పాలకొల్లు సెంట్రల్, నరసాపురం రూరల్



నరసాపురంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు హాజరైన అభిమాన గణం

మళ్లీ జగనన్ననే గెలిపించుకుంటాం

మా అమ్మమ్మకు పెన్షన్ వస్తుంది. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత వలంటీర్లు ఇంటికి వచ్చి పెన్షన్లు అందించడం చాలా బాగుంది. గత రెండు నెలలుగా చంద్రబాబు కాలం నాటి పెన్షన్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. పెన్షన్ కోసం బ్యాంక్‌కు వెళితే ఇంకా పడలేదని అంటున్నారు. మళ్లీ జగనన్ననే గెలిపించుకుంటాము. జగనన్నను చూసేందుకు కుటుంబ సమేతంగా వచ్చాము.

– వేదంగి మణికుమారి, ఆకర్తిపాలెం



జగనన్నను చూసిన ఆనందంలో..

చంద్రబాబు పేదలకు నరకం చూపించాడు



చంద్రబాబు హయాంలో మాలాంటి పేదలకు నరకం చూపించాడు. కనీసం తాగడానికి నీళ్లు కూడా దొరికేవి కాదు. ఎక్కడికో వెళ్లి నీళ్లు తెచ్చుకునే పరిస్థితి ఉండేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తరువాత పల్లెల రూపురేఖలు మారిపోయాయి. అన్నీ అందుబాటులోకి వచ్చాయి. వలంటీర్ ఇంటికి వచ్చి అన్ని పథకాలు అందిస్తున్నారు. అవి చూసి ఓర్వలేకనే చంద్రబాబు కూటమి సభ్యులు అడ్డుపడుతున్నారు.

– ఓడుగు మీరాసాహెబ్, సర్దుకొడప

మహిళలకు ఆర్థిక భరోసా



మా పిల్లలకు అమ్మఒడి వచ్చింది. మాకు డ్వాక్రా రుణమాఫీ పడింది. మా మామగారికి పెన్షన్ వస్తుంది. మంచి పథకాలు అందిస్తు న్నారు. మహిళలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడడానికి చేదోడు, చేయూత ఇచ్చి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితే మా జీవితాల్లో మరింత వెలుగులు వస్తాయని ఆశిస్తున్నాము.

– గుత్తుల బేబీసరోజ, ఎల్‌బీ చర్ల

సొంతింటి కల నెరవేరింది



నాకు ఇంటి స్థలం వచ్చింది. సొంతింటి కల నెరవేరడంతో చాలా ఆనందంగా ఉంది. ఇచ్చిన మాటను అమలు చేసే సత్తా ఉన్న నాయకుడు జగన్. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారని తెలిసి ఆయన్ను చూసేందుకు ఉదయాన్నే సభావేదిక వద్దకు వచ్చాను. మళ్లీ ఆయనే సీఎం అవ్వాలి. ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని నాకు తెలిసినవారందరికీ చెబుతున్నాను.

– పిట్టా యోహాన్, సరిపల్లి

పేదల బతుకులు బాగుపడాలంటే..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నీ అందుతున్నాయి. నా భార్యకు వైఎస్సార్ చేయూత, మనవడికి అమ్మఒడి, డ్వాక్రా రుణమాఫీ అందాయి. ఇచ్చిన హామీలు ఖచ్చితంగా అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. పేదల బతుకులు బాగుపడాలంటే మళ్లీ జగనే సీఎం కావాలి.

– సిర్రా చంద్రరావు, లిఖితపూడి

జగన్ అంటే అందరికీ అభిమానం



మళ్లీ జగన్ సీఎం అవుతారు. మండుటెండలో సైతం జగన్‌ను చూసేందుకు ప్రజలు వేచి చూస్తున్నారంటే నిదర్శనం అదే. ప్రతి ఒక్కరి కుటుంబంలో మేలు జరగడం వల్లే ఆయనంటే నాతో పాటు ప్రతి ఒక్కరికీ చెప్పలేని అభిమానం. నాకు రైతు భరోసా డబ్బులు పడుతున్నాయి. ఇంట్లో డ్వాక్రా రుణమాఫీ, సున్నా వడ్డీ అందింది. మా అమ్మాయి వలంటీర్‌గా కూడా చేస్తుంది.

– పెదపాటి శ్రీనివాసరావు, గొంది

ఆర్థికంగా నిలదొక్కుకున్నాం



జగనన్న రాకతో మహిళల జీవితాలు ఎంతో మెరుగుపడ్డాయి. ప్రతి సంవత్సరం చేయూత పథకం ద్వారా వేస్తున్న డబ్బులు, రైతు భరోసా, అమ్మఒడి పథకాలతో ఆర్థికంగా ఎంతో నిలదొక్కుకున్నాం. ఇది నా మాట మాత్రమే కాదు.. నియోజకవర్గంలోని పేద బడుగు బలహీన వర్గాల అందరి మాట. జగన్‌బాబును చూడడం చాలా సంతోషంగా ఉంది.

– గొల్ల శాంతకుమారి, చిట్టవరం

ప్రశాంత జీవనానికి జైకొట్టు

నేరాలకు స్వస్తి.. ప్రజల భద్రత జాస్తి

- గతంలో గూడెం అంటేనే హడల్
- చీటింగ్, నకిలీ కరెన్సీ, హత్యలు, కిడ్నాప్‌లకు అడ్డా
- 2004 నుంచి ఉక్కుపాదం మోపిన కొట్టు
- శాంతిభద్రతల అదుపులో తనదైన ముద్ర



తాడేపల్లిగూడెం పట్టణం

తాడేపల్లిగూడెం : అమ్మో గూడెమా అనే భయానక ఫీలింగ్ నుంచి.. హమ్మయ్యా గూడెం..అనే రిలాక్స్ ఫీలింగ్‌కు జనాలు వచ్చారంటే కొట్టు సత్యనారాయణే కారణం. కొట్టు రాకతో పట్టణంలోని క్రైమ్ కథాచిత్రం సీన్‌మారింది. నేను రౌడీని, దాదాను అని కాలర్ ఎగురేవేసేవారు కనుమరుగయ్యారు. వ్యాపార, వాణిజ్య కూడలిగా గూడెం మారుతున్న తరుణంలో విజయవాడతో సమానంగా ఇక్కడ మోటారు పరిశ్రమ విస్తరించింది. సరిగ్గా అదే సమయంలో కొందరు మోటారు ఫీల్డ్ ముసుగులో సెటిల్‌మెంట్లు, రౌడీయిజం, గూండాయిజంతో పేట్రేగిపోవడం మొదలుపెట్టారు. పిక్ పాకెటింగ్ కాస్తా.. పేక ముక్కల బ్యాచ్‌గా ఆ తరువాత చీటింగ్ బ్యాచ్‌గా ఎదిగారు. ఇదే సమయంలో టీడీపీ అధికారంలోకి రావడంతో చీటింగ్ బ్యాచ్ ఆగడాలకు అంతు లేకుండా పోయింది. సీఎం హోదాలో చంద్రబాబు ఇక్కడకు వస్తే, సీఎం కాన్వాయ్ కంటే ముందు చీటింగ్ బ్యాచ్ అంబాసిడర్ కార్ల ర్యాలీ ఉండేది. ఈ బ్యాచ్ వాళ్లే బాబు మెడలో తొలి గజమాల వేసేవారు. చీటింగ్ కాస్తా ఫేక్ కరెన్సీ, నకిలీ కరెన్సీ ముఠాలు పట్టణంలో పెరిగాయి. ఉమ్మడి ఆంధ్రాలో ఏ ప్రాంతానికైనా వెళ్లి ఏదైనా కొనుగోలు చేసే సమయంలో పది రూపాయల నోటు ఇచ్చి గూడెం పేరు చెబితే నోటును ఇచ్చిన వ్యక్తిని తేరిపార చూసే పరిస్థితి. ఈ క్రమంలో ఎన్నికల్లో నేరుగానే దాడులు చేసుకొనే పరిస్థితి ఉండేది. స్వర్గీయ మాజీ కేంద్రమంత్రి బోళ్ల బులిరామయ్య ఎన్నికల ప్రచారానికి వచ్చిన తరుణంలో ఆయన కారులోనే జేబులో బాంబులు పెట్టుకొని ప్రత్యర్థిని హతమార్చే ప్రయత్నాలు జరిగిన ఘటన, ఈవీఎం సెంటర్‌లో ఒక రౌడీషీటర్, మరో వర్గం బాంబులతో, రాళ్లతో దాడులు చేసుకున్న ఘటన, సముద్రుడు ఇచ్చిన సమాచారంతో రెక్కీ నిర్వహించి ఒక వ్యక్తిని హతమార్చే క్రమంలో ఎడమచేతి వాటం బాంబులు విసిరే విజయవాడ తంబి ఇక్కడ హల్‌చల్ చేసిన ఘటనలు ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి. బాలికల కిడ్నాప్, మైనర్లతో బ్లూఫిల్మ్‌లు తీసే ముఠాలు, గ్యాంగ్ రేప్ చేసి రైలు పట్టాలపై యువతి మృతదేహాన్ని పడేసిన దుర్ఘటనలు ఇలా ఎన్నో గతంలో జరిగాయి. ఆస్తుల కోసం అయినవారిని హత్య చేసిన వ్యక్తులకు ఇక్కడ కొదవ లేకుండా ఉండేది. అంతేనా.. సాయంత్రం ఆరైతే చాలు ఇళ్లముందు ముగ్గేసుకొనే మహిళల మెడల నుంచి పుస్తెల తాళ్లు తెంపుకొనిపోయే గ్యాంగులు, ఓమ్ని వ్యాన్‌లలో కాలేజీ యువతులను కిడ్నాప్ చేసే గ్యాంగులు, రాత్రయ్యితే చాలు చెలరేగిపోయే బ్లేడ్ బ్యాచ్‌లకు పట్టణం అడ్డాగా ఉండేది. రైలు పట్టాలపై పిఠాపురం వ్యాపారి మర్డర్ కేసు ఇక్కడ నేరప్రవృత్తికి నిలువుటద్దం. 2004కు ముందు పట్టణ పోలీసు స్టేషన్‌లో 32 మంది రౌడీషీటర్లు ఉండేవారంటే నేరం చిరునామా ఇక్కడ ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు.

కొట్టు వచ్చాక సీన్ మారింది

కొట్టు సత్యనారాయణ తొలిసారిగా ఎమ్మెల్యే అయ్యిన తర్వాత క్రైమ్ కథాచిత్రం సీన్‌మారింది. శాంతిభద్రతలకు పెద్దపీట వేయడంతో రౌడీలు తోక ముడిచారు. సెటిల్‌మెంటు నాయకులు తెరమరుగయ్యారు. వ్యాపారస్తులు హాయిగా వ్యాపారాలు చేసుకున్నారు. ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. 2019లో తిరిగి కొట్టు ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం అయిన తర్వాత శాంతిభద్రతల పరిస్థితిపై తనదైన పంథానే అనుసరించారు. ఎవ్వరూ రౌడీలని విర్రవీగకుండా పోలీసుల ద్వారా చర్యలు తీసుకున్నారు. దీంతో గూడెం సర్కిల్ పరిధిలో రౌడీ షీటర్ల సంఖ్య 12 మందికి పరిమితమైంది. చైన్ స్నాచింగ్‌లు లేవు.. హౌస్ బ్రేకింగ్‌లు లేవు.. కిడ్నాప్‌లు లేవు.. హత్యాయత్నాలు, హత్యలు లేవు. శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి.

అదనపు బీయూల ర్యాండమైజేషన్ ప్రక్రియ

భీమవరం (ప్రకాశంచౌక్): పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి అదనపు బ్యాలెట్ యూనిట్ల (బీయూ) రెండో సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తిచేసి ఏడు నియోజకవర్గాలకు తరలించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాల్ నందు అదనపు బీయూల రెండో సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియను సాధారణ పరిశీలకులు ఎం.దీప, ఎల్.నిర్మల్ రాజ్ పరిశీలనలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తిచేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గానికి 21 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున అదనపు బీయూలను ఏర్పాటు చేయాల్సి వచ్చిందని, అవసరమైన బీయూలను ఇతర జిల్లాల నుంచి తీసుకురావడం జరిగిందన్నారు. ఇంతకుముందే పార్లమెంట్‌లోని ఏడు నియోజకవర్గాలకు 1,483 బీయూలను తరలించామని, అభ్యర్థులు ఎక్కువ మంది పోటీలో ఉన్నందున 20% అదనంగా బీయూలను నియోజకవర్గాలకు తరలించినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు, ఎలక్షన్ సెక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ఎం.నన్యాపిరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు గూడూరి మనోజ్, పంపన వంశీ, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.